# నేనూ వస్తా

"మమ్మీ! నేనే తిరుపతి వెళ్లానుకుంటున్నా" గుల్బర్గాలో మెడిసిన్ చదువుకూంటూ సెలవులకొచ్చిన రాజీవ్ తల్లితో అన్నాడు.

"ఒక్కడివేనా, ఎవరైనా ఫ్రెండ్సున్నారా?" అంది వంటింట్లో టీ కలుపుతున్న లలిత. "ఒక్కడినే" రాజీవ్ టీ తాగుతూ "నువ్వు, నాన్నా కూడా వస్తే బాగుంటుందిగా" అన్నాడు.

"ఇంట్లో కుక్కపిల్లని" లలిత గొంతు తగ్గించి "తాతగారిని ఏం చేద్దాం. నువ్వు ఇంట్లో వుండి చూసుకో. నేనూ, నాన్నా నాలుగురోజుల్లో వెళ్లి వచ్చేస్తాం. తర్వాత నువ్వెళ్ళు" అంది.

"అమ్మో..." అన్నాడు రాజీవ్.

"రేపు సప్తమి. మంచిదే, దొరికితే రైలు, లేకపోతే బస్సు" రాజీవ్ మాటలకు నవ్వింది లలిత.

"కేలండర్లు, పంచాగాలు చూడడంలో మాత్రం తాతగారివే" అంది.

"పిల్చావా?" అంటూ వంటింటి గుమ్మంలో నిల్చున్న వీరరాఘవరావు లోపలకొచ్చాడు. డైనింగ్ టేబుల్ దగ్గర కూచున్నాడు.

వీరరాఘవరావు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టైపిస్టుగా చేసి రిటైరయ్యారు. రిటైరయ్యే పన్నెండేళ్లు దాటింది. కూతురు విశాఖపట్నంలో వుంటుంది. కొడుకు వాసు హైదరాబాద్ ఇంజనీర్. భార్య పోయిన వీరరాఘవరావు కొడుకూ,కోడలు దగ్గరే వుంటున్నాడు నాలుగేళ్ళుగా. మనుమరాలు సబిత, మనుమడు రాజీవ్ కూడా తాతగారిని ప్రేమగా, ఆప్యాయంగా చూస్తారు. ఇంట్లో ఎవరినీ ఏ విషయానికి విసిగించకుండా కాలక్షేపం చేస్తున్నాడు వీరరాఘవరావు.

గుమ్మంలో నుంచుని తల్లీకొడుకుల మాటలన్నీ విన్నాడు వీరరాఘవరావు.

"ఏమంటాడూ?" అన్నాడు కాఫీ తాగుతూ. "రేపు తిరుపతి వెడతానంటున్నాడు" అంది కోడలు లలిత.

"వెళ్లనీ, దైవదర్శనం మంచిదే. ఒక్కడేనా ఎవరైనా స్నేహితులున్నారా?" అన్నాడు వీరరాఘవరావు. "ఒక్కడే" అంది లలిత.

వీరరాఘవరావు లేచి తన గదిలోకి వెళ్లిపోయాడు. అక్కడ మంచం మీద పడుకుని పేపరు చదువుతాడు రోజూ. ఆ చదవడం కూడా అలా ఇలా కాదు. మొత్తం ఆ చివరనుంచీ ఈ చివరదాకా, చదివి ఆనందించడం కాదు, ఆ విశేషాలన్నీ, కొడుకుతో, కోడలుతో చెప్పాలి. ఆ తరువాత స్నానం, జపం, కొద్దిసేపు రేడియో వినడం, ఆ తరువాత భోజనం. ఈ కార్యక్రమం క్షణాల ప్రకారం జరగాల్సిందే. భార్యలేని వీరరాఘవరావు ఎవరినీ ఇబ్బంది పెట్టకుండదా కాలం గడిపేయాలని నిర్ణయించుకున్నాడు. అవును భార్య పోవడానికి ముందు వారంరోజులు ఇదే చెప్పింది "ముసలాళ్ళని ఎవరూ లెక్కపెట్టరు ఈ రోజుల్లో. రోజులు జాగ్రత్తగా, ఎవరినీ ఏమీ అనకుండా వెళ్ళబుచ్చండి" అని భార్య చెప్పిందని అందరికీ చెప్తూ వుంటాడు.

అలా పేపరు చదువుతున్న వీరరాఘవరావుకి ఉన్నట్టుండి ఓ ఆలోచన వచ్చింది కళ్ళు మూసుకున్నాడు. కళ్ళముందు దేవుడు నిలిచినట్టే అనిపించింది. అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించాడు.

ఎన్నాళ్ళయింది తిరుపతి చూసి? తనూ, భార్య ఎప్పుడో వెళ్లారు. ఆ తరువాత మనుమరాలి పెళ్లి తిరుపతిలోనే చేయబట్టి అక్కడికెళ్లాడు. ఇవన్నీ ఎన్నేళ్ళనాటి సంగతులు? తనకిప్పుడు డెభ్భై సంవత్సరాలు దాటిపోయాయి. .....మరచిపోయాడు, షష్టిపూర్తి అయ్యాక ఒకసారి వెళ్లాడు. అంటే పదేళ్ళు దాటిపోయింది.

ఎన్నాళ్లుంటాడో ఏమో! ఆఖరిగా ఒక్కసారి తిరుపతి వెళ్లి దైవదర్శనం చేసుకోవాలి అనిపించింది ఆ క్షణంలో.

చదువుతున్న పేపరు పక్కన పడేసాడు. గబగబా ముందు గదలోకొచ్చాడు. కొడుకు టీవీ చూస్తున్నాడు. ఒక్క నిముషం అలా చూసాడు. కొడుకుతోకన్నా కోడలితో మాట్లాడడమే మంచిది అనుకుంటూ వంటింట్లోకెళ్లాడు.

"కాఫీ కావాలా మామగారూ?" అంది లలిత.

"వద్దు....వద్దు" కుర్చీ జరుపుతూ కూర్చున్నాడు.

"వీడు వెడుతున్నాడా?"

"ఆ"

"ఎలాగ?"

"బస్సులో, రైలుకి టిక్కెట్స్ దొరకలేదు మరి" అంది లలిత కూర తరుగుతూ.

"నేనూ తిరుపతి చూడాలనుకుంటున్నా" వీరరాఘవరావు నెమ్మదిగా అన్నాడు.

లలిత కొంచెం ఉలిక్కిపడింది.

"చాలాసార్లు చూసారుగా?"

"దానకేముంది. ఎన్నిసార్లయినా చూడవచ్చు. పైగా నన్నెవరు తీసుకెళతారు? నువ్వూ, వాడు వెళితే ఇంట్లో నేను కుక్క కాపలా కదా. ఇంక..."

లలితకు కోపం వచ్చింది.

"అట్లా అంటారేమిటి? మీరు పెద్దవారు. మిమ్మల్ని వదిలి మేమెలా వెళ్తామని ఈమధ్య ఎక్కడికీ ఇల్లు కదలడంలేదుగా" అంది.

"అవన్నీ ఎందుకు. నేనిప్పుడు రాజీవ్‌తో కలసి వెళతాను. వాడికి కాస్త తోడుగానూ వుంటాను, నాకు వాడు సాయంగానూ వుంటాడు" వీరరాఘవరావు కొడుకు వంక చూస్తున్నాడు.

లలిత ముఖం ముడుచుకుంది. ఈ ముసలాయన్ని వాడు తీసుకెళతాడా? అయినా డెబ్భై ఏళ్ళు దాటాక ఇంకా ఊళ్లెళ్లి దేవుళ్లని చూడాలనుకుంటే ఎలా? పైగా బస్సులో అంత దూరం ప్రయాణం....లలిత మాట్లాడకుండా ఊరుకుంది.

"ఏమంటావు?" అన్నాడు.

"అబ్బే.....మీరెళ్ళలేరు. అదీ బస్సులో" అంది.

"అంటే నాలాంటి ముసలాళ్ళు బస్సుల్లో వెళ్ళలేరంటావా? నా కాళ్ళూ, కళ్ళు ఇంకా బాగానే పని చేస్తున్నాయి. ఇదే ఆఖరుసారి. నేను వెళతాను' అన్నాడు గట్టిగా.

లలితకి పెద్ద సమస్య వచ్చి పడింది. వెళ్లవద్దంటే వినేట్టులేదు మామగారు. ఈ ముసలాయన్ని వెంటబెట్టుకెళ్ళమంటే వాడికి ఇష్టం వుండదు.

"ఇంకోసారి వెళదాం మనం అందరం కలసి. ఆ కుక్కపిల్లని మా చెల్లెలింట్లో దింపి దాన్ని చూసుకోమంటాను" అంది ముభావంగా.

ఆ మాట వినగానే వీరరాఘవరావుకి కోపమొచ్చేసింది. ఈవిడకే ఇష్టం లేదన్నమాట తను తిరుపతికి వెళ్లడం. లేకపోతే ఆ డాక్టర్ కొడుకుతో నేను వెళ్లడం బాగుండదనా...చూస్తాగా" వంటింట్లోంచి ముందు గదిలోకొచ్చాడు. టీవీ చూస్తున్న కొడుకుకు ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

"ఏమిటి నాన్నగారూ....' అన్నాడు.

"ముందు దాన్ని ఆపేయ్" అంటూ కుర్చీ కొడుకుకు దగ్గరగా జరుపుకున్నాడు. తన మనసులో మాట చెప్పేశాడు. అంతా విన్నాక వాసు నవ్వాడు.

"ఇంత వయసొచ్చాక ప్రయాణాలు మంచిది కాదు నాన్నగారూ. ఇంతకుముందు చాలాసార్లు చూసారు. హాయిగా ఇంట్లోనే రోజూ పూజ చేసుకుంటున్నారు. ఇంకా కావాలంటే ఓ గంట ఇంకా ఎక్కువ చేయండి" అన్నాడు తండ్రికేసి చూస్తూ వాసు.

"అంటే తిరుపతికి వెళ్ళవద్దంటావ్? అంతేనా?"

"అది కాదు నాన్నగారూ..."

"ఎట్టాగూ వాడు వెడుతున్నాడు. వాడితో కలసి వెళితే మీకూ ధైర్యంగా వుంటుంది. అయినా నేనేమైనా రోగిష్టినా ప్రయాణాలు చేయకుండా, ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లో పడి వుండడానికి" కొపమొచ్చేసింది తండ్రికని గమనించాడు వాసు. "కాదు నాన్నగారూ. వాడితో వెళ్లడం....ఇంకోసారి మనమంతా వెళదాం" నసిగాడు. ముసలాయన పంతం పెరిగిపోయింది.

"ఏం వాడు కుర్రాడు, నేను ముసలాడిని. సరే నన్నేమయినా మోస్తాడా వాడు. వాడిని ఇబ్బంది పెట్టను. ఎలాగైనా తిరుపతి వెళ్లాల్సిందే."

రాత్రి భోజనం చేస్తున్న కొడుకు పక్కన కూచుంది తల్లి. "టిక్కెట్టు కొనుక్కున్నావా?" అంది. "ఇప్పుడెళ్లి కొనుక్కుంటా. ఇక్కడేగా?"

"కొనుక్కున్నావేమోనని భయపడ్డా."

"ఏం...నువ్వు వస్తావా?" రాజీవ్ తల్లి వైపు తిరిగాడు.

"తాతగారు" అంది కంచం వంక చూస్తూ. "ఏమిటి తాతగారా? తాతగార్ని నేను తీసుకెళ్లాలా? ఇంకా నయం" అన్నాడు రాజీవ్.

"ఆయన మొండిపట్టు పట్టారు. నీకు తప్పదు మరి" అంది నెమ్మదిగా లలిత.

"ఏమిటి మమ్మీ, బోర్. నేను తాతగార్ని తీసుకెళ్లను" ఖచ్చితంగా అన్నాడు.

"నేనూ అదే అన్నాను. కానీ మీ నాన్న నా మీద మండిపడిపోయారు. తాతగారు పెద్దవారు. ఆయన్ని తీసుకెళితే పుణ్యం అంటూ ఒకటే గోల."

"ఆ పుణ్యం మీరే వుంచుకోండి. నేనుంటా ఇంట్లో. మీరు తీసుకెళ్లండి తాతగార్ని" అన్నాడు కోపంగా.

లలితమ్మకి ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంది.

"నేను వెళ్లను సరేనా" అన్నాడు మంచినీళ్ళు తాగి రాజీవ్ గదిలోకొచ్చిన తండ్రి వంక చూస్తూ.

వాసు మాటంటే కాదనే ధైర్యంలేదు ఆ ఇంట్లో ఎవరికీ. అప్పుడప్పుడు రాజీవ్ అంటాడు తల్లితో "మనింట్లో మాత్రం పితృస్వామ్య వ్యవస్థే ఎప్పటికీ."

"నువ్వు మా నాన్నను తీసుకెళ్లక్కర్లేదు. నేనే వెళతాను. కాకపోతే నా డాక్టర్ చెకప్ వాయిదా వేసుకుంటానంతే" చాలా సీరియస్‌గా అన్నాడు తండ్రి.

అంతే! రాజీవ్ రెండు టిక్కెట్లు కొనుక్కొచ్చాడు.

చాలా విజయగర్వంతో తిరుపతి ప్రయాణం పూర్తి చేసుకుని ఇంట్లో అడుగుపెట్టాడు వీరరాఘవరావు. ధుమధుమలాడుతూ ముఖం కందగడ్డలా చేసుకున్నాడు రాజీవ్.

"అమ్మా ఎంత ఏడిపించాడో తెలుసా ఈ ముసలాయన ఛీ...." అన్నాడు రాజీవ్. "ఏమైందీ?" అంది తల్లి తిరుపతి లడ్డు ముక్క కళ్ళ కద్దుకుని నోట్లో వేసుకుంటూ.

"ఆ హోటల్లో సాంబారులో ఇంగువ ఎక్కువైందని వాడితో పోట్లాట. పోనీ ఏదో నాలుగు మెతుకులు తిని లేవచ్చుగా. పెరుగు పుల్లగా వుందట. అబ్బ.... అక్కడందరూ మమ్మల్ని చూడడమే. పైగా నేను వాక్‌మెన్ పెట్టుకుని పాటలు వింటుంటే అది తనకిమ్మంటాడు. భక్తి పాటలు వింటాడట. బుద్ధివచ్చింది. ఇంకెప్పుడూ వెంటబెట్టుకెళ్లకూడదని చెంపలేసుకుంటున్నా" రాజీవ్ కథలు కథలుగా వీరరాఘవరావు తాతగారి గురించి చెబుతుంటే గుమ్మంలో నుంచుని వింటున్న తండ్రి-

"ఇదేనా నువ్వు. ఆయనమీద చేసే కంప్లయింట్" అన్నాడు నవ్వి.

"అలా నవ్వకండి డాడీ. యాత్రకొస్తే పాత్ర కావాలంటూ ఓ పది కొట్లు తిప్పించి ఓ చిన్న రాగిచెంబు కొన్నారు. అన్నిటికీ బేరమే. పైగా నన్ను గుండు చేయించుకోమని ఒకటే గోల. అబ్బబ్బ.... ఎప్పుడు ఇంటికొచ్చేద్దామా అనిపించింది" అన్నాడు రాజీవ్. "పైగా వన్ అని టు అని ఛీ..... ఇంకెప్పుడూ తాతగార్ని తీసుకెళ్లను" గదిలోకెళ్లిపోయాడు కోపంగా రాజీవ్.

భోజనాలు చేస్తున్నారంతా.

"అమ్మాయ్! నా జన్మ ధన్యమయిపోయిందనుకో. మనవడితో తీర్థయాత్ర కెళ్లాను. చాలు నాకు. పాపం, ఈ చిన్ని తండ్రి తాతగారిని ఎంత కనిపెట్టి చూసాడో. ఒరేయ్ ఆ హోటల్లో సాంబారులో ఉల్లిపాయలు, ఇంగువ ఎక్కువైతే వాడు ఆ సర్వర్‌తో పోట్లాడి రసం, మజ్జిగ రెండు గ్లాసులు తెప్పించాడు. పైగా తాతగారూ మీరూ తినండి అంటూ ఐస్‌క్రీమ్ పెట్టించాడు." తాతగారి మాటలు వింటున్నాడు రాజీవ్. తల్లీదండ్రి వచ్చే నవ్వు ఆపుకుంటున్నారు.

తాతగారు మురిసిపోయి తిరుపతి విశేషాలు చెప్తూ మనవడిని మెచ్చుకుంటుంటే తండ్రి కొడుకువైపు చూసి నవ్వాడు.

"ఒక్క మాట వినండి. మీ ఇద్దరి తరపున కూడా నేను మొక్కుకున్నా. మా మనవడికి చదువు అయిపోయింది, మంచి బుద్ధిమంతురాలైన పిల్లతో పెళ్లి జరిపించు. ఆ కొత్త దంపతులను నేను స్వయంగా వెంటబెట్టుకొస్తానని."

రాజీవ్ మంచినీళ్లు తాగి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఏమిటీ మీరే ఆ కొత్త దంపతుల్ని వెంటబెట్టుకుని తిరుపతి వెళ్లాలని...." అంది లలిత.

"నేను మొక్కుకున్నాక ఆ మొక్కు తీర్చుకోవద్దూ" తాతగారు ముసిముసిగా నవ్వుతుంటే కొడుకూ, కోడలూ, మనవడూ కూడా విరగబడి నవ్వారు.

షష్టి పూర్తి కథలు - ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక ఏప్రిల్ 2001